

డ్రమ్ సీడర్ పద్ధతిలో..
వరి విత్తనాన్ని డ్రమ్‌సీడర్ పద్ధతిలో విత్తుకుంటే అధిక దిగుబడిని పొందవచ్చని వ్యవసాయాధికారి పేర్కొన్నారు. - 8లో



క్రీడల్లో రాణించాలి
విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంజీయూ అభివృద్ధి అధికారి ఎంవీఎన్ రెడ్డి అన్నారు. - 10లో



అరుదైన గౌరవం
చౌటుప్పల్‌కు చెందిన బొల్లోజు శ్యామ్‌కుమార్ యునెస్కో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సులో పాల్గొననున్నాడు. - 10లో

న్యూస్‌రీల్

ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కోటచలం

తుంగతుర్తి: ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటచలం వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం వైద్యసిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి గర్భిణి పోషకారం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజు ఐరన్ మాత్రలు వేసుకునే విధంగా సూచనలివ్వాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని తెలిపారు. పిల్లలకు వేసే వ్యాధి నిరోధక టీకాలు నూరుశాతం పూర్తి చేయాలని చెప్పారు. అసంక్రమణ వ్యాధులు, హైపర్ టెన్షన్, డయాబెటిస్ నిర్ధారణకు 30 సంవత్సరాలు దాటిన వారిని స్క్రీనింగ్ చేయాలన్నారు. క్షయ, లెప్రసీ నిర్ధారణకు గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో డాక్టర్ లింగమూర్తి, విజయ్, భూమిక, ఫర్మా నాయక్, హెచ్‌ఈఓ సముద్రాల సూరి, సైదమ్మ, జానకమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నారసింహుడికి లక్ష పుష్పార్చన



ఉత్సవమూర్తులకు లక్షపుష్పార్చన పూజలు చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ఏకాదశి సందర్భంగా శుక్రవారం లక్షపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలోని శ్రీస్వామి, అమ్మవార్లను అలంకరించి వివిధ పుష్పాలతో పూజలు చేశారు. అంతకుముందు సుప్రభాత సేవ, అభిషేకం, ఆరాధన, శ్రీసుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు.

పోచంపల్లిని సందర్శించిన ఢిల్లీ అధికారులు



మగ్గంపై చీర తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భూదాన్‌పోచంపల్లి : ఢిల్లీకి చెందిన యునైటెడ్ నేషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ రుచిపం, ఐసీఎల్‌ఈఐ ప్రతినిధి మోనాలిసా సేన్ శుక్రవారం భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా చేనేత గృహాలకు వెళ్లి మగ్గాలపై చీరల తయారీ విధానాన్ని పరిశీలించారు. మార్కెటింగ్, కార్మికులకు లభిస్తున్న గిట్టుబాటు ధరపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం చేనేత వస్త్ర దుకాణాలను సందర్శించి ఇక్కత్ డిజైన్లతో కూడిన చీరలను పరిశీలించి కార్మికుల కళానైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం చేనేత వస్త్రాలు కొనుగోలు చేశారు. ఇక్కత్ వస్త్రాల ప్రాముఖ్యత, పోచంపల్లి చారిత్రక నేపథ్యాన్ని పోచంపల్లి టై అండ్ డై అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి భారత లవకుమార్ వారికి వివరించారు.


ఎన్జీ విద్యార్థుల ప్రతిభ

రామగిరి(నల్లగొండ) : మహాత్మాగాంధీ యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన క్రాస్ కంట్రీ రన్నింగ్ టోర్నమెంట్‌లో నల్లగొండ ఎన్జీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కళాశాల పీడీ కదారి మల్లేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారన్నారు. ధనుష్, ముఖేష్ త్వరలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విజేతలను కళాశాల విద్య జేడీ ప్రొఫెసర్ యాదగిరి, ప్రిన్సిపాల్ ఉపేందర్ అభినందించారు.

గ్యారంటీల అమలుకు పెద్ద మొత్తంలో నిధులు అవసరం

- జిల్లాలో ఏడాదికి అయ్యే ఖర్చు రూ. 2,909.56 కోట్లు
- ప్రతినెలా రూ.242కోట్లకుపైగా అదనపు భారం
- హామీల అమలుపై సర్వత్రా చర్చ

ఆరింటిపై ఆశలు..!



దురాజ్‌పల్లి (సూర్యాపేట): కొత్తగా కొలువు తీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ప్రజలకు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించింది. వీటిలో ప్రధానంగా మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత పథకాలు ఉన్నాయి. ఈ హామీలపై ఈ నెల 7న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన ప్రమాణస్వీకార కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలి సంతకం చేసిన విషయం విదితమే. ఈ హామీలపై ప్రజల్లో చర్చ జరుగుతుండగా.. ఆశావాహులు, అర్హులు ఎప్పుడెప్పుడు అమలు చేస్తారని ఎదురుచూస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ హామీల అమలుకు భారీ ఎత్తున ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ పథకాలను అమలు చేస్తే జిల్లాలో ప్రతిఏటా రూ.2,909.56 కోట్లు అదనంగా చెల్లించాల్సి వస్తుంది.

రైతు భరోసా

రైతు భరోసా పథకం కింద రైతులు, కౌలు రైతులకు ఏటా ఎకరాకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, వరి పంటకు అదనంగా క్వింటాకు రూ.500 మద్దతు ధర చెల్లిస్తామని ప్రకటించింది. జిల్లాలో 2,61,191 మంది రైతులు ఉన్నారు. వీరికి రెండు సీజన్లకుగాను రూ.620 కోట్లు చెల్లిస్తున్నారు. దీనిని రూ.15 వేలకు మార్చడంతో మరో రూ.310 కోట్లు అదనపు భారం పడనుంది. ఇక కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేలు ఇస్తామనడంతో అదనపు భారం పడుతుంది. వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేల చొప్పున అం దిస్తే రూ.60 కోట్ల భారం పడనుంది. రైతు భరోసా అమలుకు ఏటా రూ.410 కోట్లు అదనపు భారం తప్పదు.

గృహజ్యోతి

గృహజ్యోతి పథకం కింద ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. జిల్లాలో మొత్తం 5,08,182 విద్యుత్ కనెక్షన్లు ఉండగా ఇందులో గృహ విద్యుత్ వినియోగదారులకు చెందిన 3,13,865 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ పథకం అమలుకు సంవత్సరానికి రూ. 376.56 కోట్లు చెల్లించాలి.

మహాలక్ష్మి పథకం

ఈ పథకంలో భాగంగా మహిళలకు నెలకు రూ.2500, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీలో ఉచితం ప్రయాణం కల్పించాల్సి ఉంది. ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 5.11లక్షల మంది మహిళలు ఉన్నారు. వీరిలో సుమారు 60 వేల మంది వరకు వివిధ కేటగిరీల్లో పింఛన్లు పొందుతున్నారు. అంటే సుమారు 4.61లక్షల మందికి నెలకు రూ.2,500 చొప్పున అందించాల్సి ఉంది. దీంతో జిల్లాలో ప్రతినెలా రూ.115.25 కోట్ల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. జిల్లాలో 4,05,898 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. సిలిండర్ రూ.500కే ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. దీంతో ప్రతినెలా మరో రూ.5కోట్లు చెల్లించాలి. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి సంవత్సరానికి రూ.54 కోట్లు ఖర్చు చేయాలి. ఈ పథకం అమలుకు జిల్లాలో ప్రతిఏటా రూ.1,497 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది.

యువ వికాసం..

యువ వికాసం పథకం కింద విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డులు అందించనున్నారు. అంతేగాక ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేయాల్సి ఉంది. జిల్లాలో 40వేల మంది వరకు 10వ తరగతి నుంచి పీజీ చదివే విద్యార్థులు ఉన్నారు. ఈ పథకం అమలుకు ఏటా దాదాపు రూ.20 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇంటర్నేషనల్ స్కూళ్ల ఏర్పాటుకు మరో రూ.100 కోట్లు అవసరం కానున్నాయి. మొత్తంగా రూ.120కోట్లు వెచ్చించాలి.

ఇందిరమ్మ ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు లేని వారందరికీ ఇంటి స్థలముంటే రూ.5 లక్షలు చెల్లించనున్నారు. స్థలంలేని వారికి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఇస్తామని ప్రకటించింది. ప్రస్తుతం జిల్లాలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల కోసం 1.60 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో ఇళ్లులేని వారి సంఖ్య దాదాపు 2.5 లక్షల పైచిలుకు ఉండే అవకాశం ఉంది. ఈపథకానికి రూ.125 కోట్లు అవసరం ఉంది. తెలంగాణ ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు 250 చదరపు గజాలు ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. వారందరికీ రూ. 5లక్షల చొప్పున ఇంటి నిర్మాణానికి మంజూరు చేయాల్సి వస్తుంది. దీనికి మరో రూ.10 కోట్లు అవసరం రావచ్చు. మొత్తంగా రూ.135 కోట్ల భారం పడనుంది.

చేయూత

చేయూత పథకం కింద అర్హులైన పింఛన్ దారులకు నెలకు రూ.4వేలు ఇస్తామని ప్రకటించింది. జిల్లాలో 1,52,735 మంది పెన్షన్ దారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.61 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ప్రతినెలా రూ.25 కోట్ల అదనపు భారం పడనుంది. సంవత్సరానికి రూ.371 కోట్లు అదనంగా చెల్లించాలి.

రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న కొత్తపల్లి శివకుమార్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): తుపాన్ ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మీచాంగ్ తుపాన్ ప్రభావంతో పంట నష్టం జరిగిందని, అధికారులతో సర్వే చేయించి ఎకరానికి రూ.50వేల పంట నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మట్టపల్లి అంజన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎర్ర అఖిల్, పద్మక్క పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న పోస్టల్ సిబ్బంది

మునగాల: ఆల్ ఇండియా గ్రామీణ డాక్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ సేవక్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఈనెల 12నుంచి నిర్వహించనున్న గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మెను జయప్రదం చేయాలని ఉద్యోగుల సూర్యాపేట డివిజన్ కన్వీనర్ నాగారాజు కోరారు. ఈ మేరకు శుక్రవారం మునగాలలో సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, ఎస్.బ్రహ్మాచారి, మన్సూర్ అలీ, పుల్లయ్య, యాకన్న, సునీల్, సందీప్, నరేష్, దివ్య, స్వాతి, సరస్వతి పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

- సీఎం గ్రీవెన్స్ దరఖాస్తులకు కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్
- కలెక్టర్ వెంకట్రావ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రజావాణి అర్జీల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేయాలని, దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి ముఖ్యమంత్రి గ్రీవెన్స్ నుంచి వచ్చే దరఖాస్తుల పరిష్కారానికి కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తామని, ఈ సెల్ రెవెన్యూ అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో పనిచేయనుందని తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి జిల్లా అధికారులు హాజరుకావాలని, ప్రతి మండలంలో ప్రజావాణిలో మండల స్థాయి అధికారులు పాల్గొనాలన్నారు. త్వరలోనే గ్రామ పంచాయతీ స్థాయిలో కూడా ప్రజావాణి నిర్వహించేందుకు సీఈఓ, డీపీఓలు సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. శనివారం సాయంత్రం వరకు ఆయా మండలాల్లోని ప్రజావాణి దరఖాస్తులను గూగుల్ షీట్‌లో పంపించాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చే అర్జీలకు రసీదులు అందించాలని, మండలాలకు సంబంధించిన అర్జీలను వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ సురేష్, పీడీ కిరణ్‌కుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు, జీఎం. పరిశ్రమలు తిరుపతయ్య, డీసీఓ మోహన్‌బాబు, ఏఓ సుదర్శన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపోటములు సహజం



మాట్లాడుతున్న మల్లు నాగార్జునరెడ్డి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

కోదాడఅర్బన్: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, వచ్చిన ఫలితాలను విశ్లేషించుకుని, భవిష్యత్‌లో ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టులు గెలిచినా, ఓడినా ప్రజాపక్షమే ఉంటారని, సీట్లు ముఖ్యం కాదన్నారు. రెండు నియోజకవర్గాల్లో రూపాయి పంచకుండా ప్రజల ఓట్లను పొందిన ఏకైక పార్టీ సీపీఎం మాత్రమేనన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు వరి, పత్తి పంటలకు నష్టపరిహారం కింద ఎకరాకు రూ. 50వేలు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తమ పార్టీ సంపూర్ణ సహకారం అందిస్తామని, ప్రజా కార్మిక, రైతాంగ సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. సీపీఎం మునగాల మండల కార్యదర్శి చందా చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు జిల్లపల్లి నర్సింహారావు, దేవరం వెంకటరెడ్డి బెల్లంకొండ సత్యనారాయణ, ముత్యాలు, వెంకటేశ్వర్లు, బసవయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

పెన్షన్ సౌకర్యం కల్పించాలి

భానుపురి (సూర్యాపేట) : 1969 తొలి తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్ సౌకర్యం కల్పించాలని తొలితరం ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్ సందర్భంగా వినతిపత్రం సమర్పించారు. అంతకుముందు ఆయన ఉద్యమకారులతో కలిసి గన్‌పార్క్ దగ్గర అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 1969 ఉద్యమ సమయంలో ఆనాటి ప్రభుత్వాలు ఉద్యమకారులను జైలులో పెట్టి హింసలకు గురి చేశాయన్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా ప్రభుత్వం తమ డిమాండ్లు నెరవేర్చలేదన్నారు. తొలితరం ఉద్యమకారులకు రూ.25వేల పెన్షన్ సౌకర్యం, 250 గజాల స్థలం, హెల్త్ కార్డులను జారీ చేసి బస్‌పాస్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో దేవత్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.



గన్‌పార్క్ వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మహిళలకు రైట్.. రైట్!

నేటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

- రీజియన్ పరిధిలోని బస్సుల్లో రోజుకు 1.70 లక్షల మంది రాకపోకలు
- ఇందులో 60వేల నుంచి 70వేల మంది మహిళలు ఉంటున్నట్లు అంచనా



భానుపురి (సూర్యాపేట)/నల్లగొండ రూరల్: కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయానికి రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదలయ్యాయి. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనే ఈ అవకాశం ఉండనుంది. దీనిపై ఇప్పటికే క్షేత్రస్థాయిలో కండక్టర్లకు సైతం ఆదేశాలు జారీ చేయగా.. శనివారం మధ్యాహ్నం 2గంటల నుంచి ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో రోజుకు సుమారు 60వేల నుంచి 70 వేల మంది మహిళలు బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నట్లు అంచనా. ఈ పథకంతో వీరందరికీ లబ్ధి చేకూరనుంది.

నిత్యం 1.60 లక్షల మంది ప్రయాణం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏడు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో ఆర్టీసీ, అద్దె బస్సులు కలిపి మొత్తం 640 బస్సులు నిత్యం ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తుండగా సుమారుగా 2,47,899 కిలోమీటర్ల మేర తిరుగుతున్నాయి. అత్యధికంగా నల్లగొండ డిపోకు చెందిన బస్సులు 126 ఉండగా 48,833 కిలోమీటర్లు అత్యల్పంగా నార్కట్‌పల్లి డిపోనకు చెందిన 14 బస్సులు 4,021 కిలోమీటర్లు తిరుగుతున్నాయి. మొత్తంగా ఈ బస్సుల్లో 1.60 లక్షల నుంచి 1.70 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇందులో 40 శాతం మేర అంటే.. 60 వేల నుంచి 70వేల మంది దాకా మహిళలు ఉంటున్నట్లు ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు.

డిపోల వారీగా పల్లెవెలుగు ఎక్స్‌ప్రెస్ బస్సులు ఇలా..

డిపో	ఆర్డినరి	ఎక్స్‌ప్రెస్
దేవరకొండ	62	39
నల్లగొండ	70	12
నార్కట్‌పల్లి	12	02
మిర్యాలగూడ	51	05
యాదగిరిగుట్ట	55	22
కోదాడ	40	18
సూర్యాపేట	62	45

మినీ బస్సులు : 24

ప్రభుత్వంపై రూ.50 లక్షల వరకు భారం..

మహిళలకు ఉచిత సదుపాయాన్ని కల్పిస్తే ఆర్టీసీకి రూ.50లక్షల వరకు భారం పడే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇక ప్రస్తుతం ఉన్న 40 శాతం రేషియో కాస్త 60 శాతం వరకు వెళ్లే అవకాశముంటుందని, అప్పుడు ఆర్టీసీపై పడే భారం పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పథకం అమలును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో క్షేత్రస్థాయి వరకు మార్గదర్శకాలపై ఒక్కరోజులోనే అవగాహన కల్పించేందుకు ఆర్టీసీ యాజమాన్యం చర్యలు తీసుకుంది.

రాష్ట్రమంతటా ఉచితంగా..

మహిళలె రాష్ట్ర మంతటా ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. రాష్ట్రం దాటితే టికెట్ ధర చెల్లించాల్సి ఉంది. సూర్యాపేట డిపోనకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్ శ్రీశైలం వెళుతుంది. రాష్ట్ర సరిహద్దు వరకు ఉచిత ప్రయాణం ఉంటుంది. రాష్ట్ర సరిహద్దు దాటితే అదే బస్‌లో టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



అన్ని వయస్సులకు చెందిన మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో తెలంగాణ పరిధిలో ఎన్ని కిలోమీటర్లు అయినా ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. తెలంగాణ స్థానికతను తెలిపేలా ఏదైనా గుర్తింపు కార్డు చూపించి ప్రయాణించవచ్చు. మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలి. ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికుల పట్ల హుందాగా వ్యవహరించాలి. ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలి.

– శ్రీదేవి, ఆర్టీసీ ఆర్‌ఎం, నల్లగొండ

క్రాస్‌కంట్రీ రేస్‌కు రామన్నపేట విద్యార్థి



లింగస్వామిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రాహతఖానమ్

రామన్నపేట: మహారాష్ట్రలో జాతీయ విశ్వవిద్యాలయాల స్థాయిలో జరగనున్న క్రాస్‌కంట్రీ రేస్ (10కేరన్)కు రామన్నపేట ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థి ఎన్.లింగస్వామి ఎంపికయ్యాడు. లింగస్వామి ఇటీవల మహాత్మాగాంధీ యూనివర్శిటీలో జరిగిన అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ రేస్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికచేశారు. లింగస్వామి, పీడీ అనితను కళాశాల ప్రిన్సిపాల్ రాహతఖానమ్, అధ్యాపకులు అభినందించారు.

కనులపండువగా గంధం ఊరేగింపు



అర్వపల్లి సమీపంలోని హజ్రత్ ఖాజానసీరుద్దీన్ బాబా దర్గా ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న గంధం ఊరేగింపు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దిరాల : మద్దిరాల మండలంలోని రెడ్డిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ మేఘన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, రోడ్ల వెంట విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

మోత్కూరు : కొనుగోలు కేంద్రాల్లో ఇంకా 30 శాతం ధాన్యం మిగిలిపోయిందని, పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మోత్కూరులో విలేకరులతో మాట్లాడారు. నూతన ప్రభుత్వం వాగ్దానాలు తప్పనిసరిగా అమలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యానికి మద్దతు ధర పెంచాలని కోరారు.సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరు బాలరాజుగౌడ్, కల్లూరి మల్లేషం, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, పట్టణ కార్యదర్శి కూరపాటి రాములు, జిల్లా నాయకులు బుర్ర అనిల్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

- జిల్లా ప్రధాన జడ్జి జయరాజు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి క్రైం : కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లు దోహదపడుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జయరాజు పేర్కొన్నారు. డిసెంబర్ 30న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శుక్రవారం జిల్లా కోర్టులో న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో నిర్వహించిన జిల్లా కోఆర్డినేషన్ సమావేశంలో ఆయన పాల్గొని లోక్ అదాలత్‌పై చర్చించారు. రాజీపడదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్, ట్రాఫిక్ చలనా, కుటుంబ తగాదాలు, సివిల్, బ్యాంక్, టెలిఫోన్, చిట్‌ఫండ్, ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సివిల్, క్రిమినల్ కేసులు 4,888, బీఎస్ఎన్ఎల్ 421 కేసులు పరిష్కారానికి వీలైనవిగా గుర్తించినట్లు చెప్పారు. న్యాయమూర్తులు, పోలీసు అధికారులు కేసుల పరిష్కారానికి చొరవచూపాలని కోరారు. డీసీపీ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ రాజీ పడదగిన కేసుల పరిష్కారానికి సంబంధించిన ఇప్పటికే పోలీసు యంత్రాంగానికి సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీమతి మారుతిదేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జ్ నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత, డీఆర్‌ఓ పద్మజారాణి, ట్రాఫిక్ సీఐ మధుసూదన్ పాల్గొన్నారు.

‘ఎయిమ్స్’ పనులు వేగిరం



ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆవరణలో నిర్మాణ దశలో ఉన్న వివిధ భవనాలు

- రాత్రి, పగలు తేడా లేకుండా భవనాల నిర్మాణ పనులు
- ప్రారంభానికి సిద్ధమైన డైరెక్టర్, ఆయుష్ ఆస్పత్రి నూతన భవనాలు
- ఈ ఏడాదిలోనే సదుపాయాలన్నింటినీ అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు

బీబీనగర్: యాదాద్రి జిల్లా బీబీనగర్‌లోని ఎయిమ్స్ (ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో అత్యాధునిక సదుపాయాలతో కూడిన భవనాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 2024లోపే నూతన భవనాలన్నింటినీ అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు రూపొందించి పనులను ముమ్మరం చేశారు. అందులో భాగంగానే పగలు, రాత్రి అనే తేడా లేకుండా సాగుతున్న భవనాల నిర్మాణ పనులు చివరి దశకు వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

తీరనున్న మౌలిక వసతుల సమస్య

ఎయిమ్స్‌లోని వివిధ విభాగాలతో కూడిన భవన నిర్మాణాల పనులు చివరిదశకు చేరాయి. త్వరలో ఎయిమ్స్‌లోని ఎంబీబీఎస్ విద్యార్థులకు వసతిగృహాల సమస్య తీరనుంది. సరైన వసతి లేకపోవడంతో కొంత మందిని ఇప్పటికే ఎయిమ్స్‌కు దూరంగా అద్దె భవనాల్లో ఉంచుతున్నారు. అలాగే ఫ్యాకల్టీ, ఉద్యోగులకు క్వార్టర్లు లేకపోవడంతో స్థానికంగా, సిటీలోని అద్దె ఇళ్లల్లో నివసిస్తున్నారు. మరో 2,3నెలల్లో భవనాల నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉండడంతో విద్యార్థులు, ఉద్యోగుల వసతి సమస్యలు తీరనున్నాయి.

నిర్మాణాల్లో జాప్యం జరగకుండా..

2023 ఏప్రిల్ 8న ప్రధాని మోదీ భవన నిర్మాణ పనులను వర్చువల్‌గా ప్రారంభించారు. అప్పటి నుంచి భవన నిర్మాణాల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్‌సీసీ సంస్థ ఆధ్వర్యంలో రాత్రి సమయాల్లో సైతం పనులు కొనసాగిస్తున్నారు. ఇందుకోసం కూలీలు, మేస్త్రీలను, ఇంజనీర్లను స్థానికంగా అద్దె భవనాల్లో, ఎయిమ్స్‌లోనే షెడ్లు నిర్మించి కూలీలకు వసతి కల్పిస్తున్నారు.ఎయిమ్స్‌లో దాదాపు 400మందికి పైగా పనులు చేస్తున్నారు.

రూ.1,365.95కోట్ల వ్యయంతో..

ఎయిమ్స్‌లోని 750పడకల సామర్థ్యంతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, వైద్య కళాశాల, వసతి గృహాలు తదితర వాటి నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం 1,365.95 కోట్లు మంజూరు చేసింది. నిధులు సిద్ధంగా ఉండడంతో పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా శరవేగంగా కొనసాగుతున్నాయి.

20కి పైగా వివిధ విభాగాల భవన నిర్మాణాలు

ఎయిమ్స్ ఆవరణలో మొత్తం 20కి పైగా వివిధ విభాగాలతో కూడిన భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఆయుష్ ఆస్పత్రి నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. అలాగే డైరెక్టర్ కార్యాలయం, రెసిడెన్సీ, అడ్మినిస్ట్రేటివ్ భవనాలు చివరి దశకు చేరుకుంటున్నాయి. విద్యార్థుల వసతి గృహాలు, ఫ్యాకల్టీ సిబ్బంది క్వార్టర్స్, డైనింగ్ బ్లాక్, అతిథిగృహం, కమ్యూనిటీ భవనం, రోగుల బస చేసేందుకు షెల్టర్లు తదితర భవనాలతో పాటు ఎయిమ్స్ ముందు వీఐపీల ప్రధాన ద్వారం ఆర్చీ, కుడి ఎడమ వైపుల రోగులు, సిబ్బంది కోసం ఇన్, ఔట్‌కు మరో రెండు ఆర్చీల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

వైద్యసేవలు విస్తరింపజేస్తాం



ఎయిమ్స్‌లో కొనసాగుతున్న భవనాల నిర్మాణాలను 2024లోపే పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించాం. ఇప్పటికే కొన్ని భవనాల నిర్మాణాలు చివరి దశకు చేరుకున్నాయి. నిర్ణీత సమయం లోపు పనులను పూర్తి చేసి ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువస్తాం.

– వికాస్ భాటియా, ఎయిమ్స్ డైరెక్టర్, బీబీనగర్

గ్యాస్ కనెక్షన్ కేవైసీ అప్‌గ్రేడ్‌కు బారులు



గ్యాస్ కనెక్షన్‌కు కేవైసీ చేయించేందుకు ఆధార్‌కార్డు, గ్యాస్ బుక్, ఫోన్ నంబర్ అప్‌డేట్ చేయించుకోవాలని ప్రచారం జరుగుతుండటంతో ఏజెన్సీల వద్దకు వినియోగదారులు పరుగులు పెడుతున్నారు. అయితే, ఈ అప్‌డేట్ రూ.500 గ్యాస్ కనెక్షన్ కోసమనే అపోహతో శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఇలా బారులుదీరారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



ప్రహరీల మధ్య తలకిందులుగా ఇరుక్కుని మృతి

- మద్యం మత్తులో జారి పడి మృతి చెందాడని పోలీసుల ప్రాథమిక నిర్ధారణ
- మృతుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్టణం వాసి


మధ్య తలకిందులుగా నాగికుమార్ మృతదేహం

భువనగిరి క్రైం : మద్యం మత్తులో ఓ వ్యక్తి గుడి, రైల్వేస్టేషన్ ప్రహరీల మధ్య తలకిందులుగా ఇరుక్కుని మృతిచెందాడు. విశాఖపట్టణంలోని మధురవాడకు చెందిన మూడబత్తుల నాగికుమార్(44) రెండు మాసాల క్రితం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఒకరికి వ్యక్తి గత సహాయకుడిగా వచ్చాడు. గురువారం సాయంత్రం నాగికుమార్ అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఇంటినుంచి బయటకి వెళ్లాడు. శుక్రవారం ఉదయం రైల్వేస్టేషన్ ఎదురుగా గల పోచమ్మగుడి, రైల్వేస్టేషన్ ప్రహరీల మధ్య ఇరుక్కుని స్థానికులకు విగతజీవుడిగా కనిపించాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని బయటికి తీశారు. మద్యం మత్తులో గుడి ఎక్కి ప్రమాదవశాత్తు జారి రెండు ప్రహరీల మధ్య పడి ఉంటాడని, తలకు బలమైన గాయమై, అందులోనే ఇరుక్కుని మృతిచెంది ఉంటాడని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. నాగికుమార్ పోచమ్మ గుడి ఎందుకు ఎక్కాడు? ప్రహరీల మధ్య ఎలా ఇరుక్కున్నాడు? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు.

‘మిచాంగ్’ ఎఫెక్ట్.. రైతులకు తీవ్ర నష్టం

- హుజూర్‌నగర్ నియోజకవర్గంలో దెబ్బతిన్న వివిధ పంటలు
- దిగుబడి చేతికొచ్చే దశలో తుపాను నిండా ముంచిందని కర్షకుల ఆవేదన
- పరిహారం చెల్లించి ఆదుకోవాలని వేడుకోలు


వజినేపల్లిలో ఈదురుగాలులకు విరిగిన అరటి చెట్లు

హుజూర్‌నగర్ : మిగ్‌జాం తుపాను ప్రభావంతో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. తుపాను కారణంగా రెండు మూడు రోజులు కురిసిన వర్షానికి చింతలపాలెం, మేళ్లచెరువు, మఠంపల్లి తదితర మండలాల్లో రైతులు సాగు చేసిన మిరప, అరటి తోటలకు, పత్తి, మొక్కజొన్న, వరి పంటలు చాలా వరకు దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. వర్షానికి ఈదురుగాలులు తోడు కావడంతో ఆయా పంటలు నేలవాలాయి. అరటి చెట్లు విరిగి పోయాయి. పంటలు చేతికి వచ్చే దశలో కురిసిన వర్షానికి పత్తి, మిరప రంగు మారి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతే కాకుండా మిరపతోటల్లో నీరు నిలవడంతో వేరుకుళ్లు తెగులు ఆశించి మొక్కలు చచ్చిపోతాయని ఆందోళన చెందుతున్నారు. కోసి కల్లాల్లో, రోడ్ల మీద ఆరబోసిన వరి ధాన్యం రాసులు తడిసి పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా వానాకాలం వరి కోతలు సగం మాత్రమే పూర్తయ్యాయి. చేతికొచ్చే దశలో ఉన్న వరి పంట నేలవాలింది. వరి కంకులను లేపి కట్టలు కట్టేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చింతలపాలెం మండలంలో 1,605 ఎకరాల్లో మిరప, మఠంపల్లి మండలంలో 625 ఎకరాలు, మేళ్లచెరువు మండలంలో 112 ఎకరాల్లో మిరప తోటలకు నాష్టం వాటిల్లింది. చింతలపాలెం మండలంలోని వజినేపల్లిలో 5 ఎకరాల అరటి తోటలు తుపాను, ఈదురు గాలులకు నేలవాలాయి. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో దాదాపు 4వేల పైచిలుకు ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నష్టపోయిన పంటలను పరిశీలించి నష్టపరిహారం చెల్లించి తమను ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.


మఠంపల్లిలో దెబ్బతిన్న మిరపతోటలు

ప్రియుడే చంపేశాడు..!

- మరికొందరి సహకారంతో దళిత మహిళ హత్య
- తనను దూరం పెడుతుందన్న కారణంతోనే ఘాతుకం
- పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు
- విచారణలో వెలుగుచూస్తున్న వాస్తవాలు


మంజుల (ఫైల్)

నల్లగొండ క్రైం, రామగిరి(నల్లగొండ) : నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి వద్ద గురువారం వెలుగుచూసిన దళిత మహిళ హత్య కేసు చిక్కుముడి వీడుతున్నట్లు తెలిసింది. తనను దూరం పెడుతుందన్న కారణంతోనే ఆమెతో సఖ్యతగా మెలుగుతున్న ప్రియుడే మరి కొందరి సహకారంతో దారుణానికి ఒడిగట్టినట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ మండలంలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన వల్లందాసు ఈదయ్య కూమార్తె మంజుల(34)కు ఖమ్మం జిల్లా కొత్తగూడెంకు చెందిన రవికుమార్‌తో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఓ కుమారుడు ఉన్నాడు. మంజులకు ఆమె భర్తతో గొడవలు జరుగుతుండడంతో 7సంవత్సరాలుగా తల్లిగారి ఊరైన వెలుగుపల్లిలో ఉంటోంది. మంజుల రెండు నెలలుగా నల్లగొండలోని మెడికల్ కళాశాలలో వంటపని చేస్తోంది.

నర్స్ పనిచేస్తున్న సమయంలో..

మంజుల గతంలో నల్ల గొండలోని ఓ ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణుడి ఆస్పత్రిలో నర్స్‌గా పనిచేసింది. ఆ సమయంలో అక్కడే ఓ ఆటో డ్రైవర్‌తో ఏర్పడిన చనువు వివాహేతర సంబంధానికి దారితీసింది. తదనంతరం మంజుల నల్లగొండలోనే ఓ అద్దె ఇంట్లో ఉంటూ సహజీవనం చేసింది. అయితే, సఖ్యతగా మెలుగుతున్న వ్యక్తి మంజులను అనుమానించి చిత్రహింసలు పెడుతుండడంతో తట్టుకోలేక పోయింది. అనంతరం మంజుల నర్స్ ఉద్యోగం మానేసి రెండు నెలలుగా తల్లిగారి ఇంటి వద్ద ఉంటూ నల్లగొండలోని మెడికల్ కళాశాలలో వంటపని ఉద్యోగానికి వచ్చి పోతోంది. నెల రోజుల క్రితం మంజులతో సఖ్యతగా ఉంటున్న వ్యక్తి ఆమె తండ్రికి ఫోన్‌చేసి కూతురు ప్రవర్తన మార్చుకోమ్మని, తనను దూరం పెడితే బాగోదని హెచ్చరించాడని సమాచారం.

కాల్ డేటా ఆధారంగా..

మంజుల ఫోన్ కాల్‌డేటా ఆధారంగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి కేసును ఛేదించినట్లు సమాచారం. హతురాలి తల్లిదండ్రులు కూడా మంజులతో సఖ్యతగా మెలిగిన వ్యక్తి ఫోన్ చేసి బెదిరించిన విషయాన్ని పోలీసులకు వివరించడంతో తొలుత అతడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. తనను దూరం పెడుతుండడంతోనే మరో నలుగురి సహకారంతో ఘాతుకానికి ఒడిగట్టినట్లు నేరం అంగీకరించినట్లు సమాచారం. పోలీసులు హత్యోదంతంతో సంబంధమున్న మిగిలిన నలుగురిని అదుపులోకి తీసుకుని లోతుగా విచారణ జరుపుతున్నారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం ఒకటి, రెండు రోజుల్లో నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి కోర్టులో హాజరుపర్చనున్నారని తెలుస్తోంది.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

దళిత మహిళను అత్యంత క్రూరంగా హత్య చేసిన నిందులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి. ప్రభుత్వం ద్వారా రూ. 20లక్షల నష్టపరిహారంతో పాటు కుమారుడికి ప్రభుత్వం ఇవ్వాలి. దళిత మహిళలపై అఘాయిత్యాల నివారణకు పోలీసులు చర్యలు తీసుకోవాలి.

– పాలడుగు నాగార్జున, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆటోలో తీసుకెళ్లి..


మంజుల బుధవారం మధ్యాహ్నం హాస్టల్‌కు వచ్చిన విషయాన్ని ఆమె ప్రియుడు తెలుసుకున్నాడు. సాయంత్రం 5గంటల ప్రాంతంలో ఆటోలో వచ్చి మంజులను తీసుకెళ్లాడు. అప్పటికే తనను దూరం పెడుతున్న ప్రియురాలిని చంపాలని నిర్ణయించుకున్న అతను చీకటి పడిన తర్వాత అనిశెట్టి దుప్పలపల్లి నుంచి బసిరెడ్డిపల్లికి వెళ్లే దారిలో నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. మరో నలుగురి సహకారంతో అదే రోజు రాత్రి 9 నుంచి 10 గంటల ప్రాంతంలో ఆటో టైర్లు మార్చే జాకీ రాడ్‌తో ముఖంతో పాటు తలపై బలంగా మోది హత్య చేసినట్లు తెలిసింది.

హాస్టల్ నుంచి ఫోన్ చేశారని..

మంజుల రెండు రోజులుగా మెడికల్ కళాశాలలో వంటపని విధులకు హాజరుకాకపోవడంతో హాస్టల్ నిర్వహణ సిబ్బంది ఫోన్ చేశారు. బుధవారం మధ్యాహ్నం మంజుల సోదరుడు కిరణ్ బైక్‌పై ఆమెను హాస్టల్ వద్ద డ్యూటీలో వదిలివెళ్లాడు. బుధవారం రాత్రి ఆలస్యం అవడంతో కుటుంబ సభ్యులు మంజులకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో చుట్టు పక్కల తెలిసిన వారిని మంజుల గురించి ఆరా తీసినా ఫలితం లేదు.

డ్రమ్ సీడర్ పద్ధతిలో అధిక దిగుబడి

- నడిగూడెం ఏఓ రాజగోపాలరావు



నడిగూడెం : రబీ సీజన్‌లో వరి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇలాంటి సమయంలో నీటి సౌకర్యం ఉన్న రైతులు నారు పెంచి, కూలీలతో నాట్లు పెట్టిస్తుంటారు. దీంతో సమయం, పెట్టుబడి కూడా పెరుగుతుంది. కాబట్టి రైతులు వరి విత్తనాన్ని డ్రమ్ సీడర్ పద్ధతిలో నేరుగా విత్తుకుంటే, కూలీల సమస్యను అధిగమించి, పెట్టుబడులు తగ్గించుకుని అధిక దిగుబడిని సాధించవచ్చని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు చెబుతున్నారు.

నేలలు : సమస్యాత్మక నేలలు (చౌడు లేదా క్షారము లేదా ఆమ్లము) తప్ప సాధారణంగా వరిని సాగు చేసే అన్ని నేలలు అనుకూలం. ముంపునకు గురయ్యే భూములు అనుకూలం కాదు.


డ్రమ్‌సీడర్ లాగుతున్న రైతు

విత్తనమోతాదు : వరి రకాన్ని బట్టి రకరానికి 10-15 కిలోలు అవసరమవుతాయి. కాండం గట్టిగా ఉండి వేరు వ్యవస్థ ధృడంగా ఉండి, పడిపోని రకాలు మిక్కిలి అనుకూలం. ఆయా ప్రాంతానికి అనువైన, రైతుకు ఇష్టమై ఏ రకమైనా ఈ పద్ధతిలో సాగు చేసుకోవచ్చు.


డ్రమ్‌సీడర్ పద్ధతిలో సాగు చేసిన వరి పొలం

విత్తడానికి ఇద్దరు కూలీలు

డ్రమ్ సీడర్ పద్ధతిలో ఒక ఎకరం విత్తడానికి ఇద్దరు కూలీలు అవసరమవుతారు. డ్రమ్‌సీడర్ లాగడానికి ఒక మనిషి, గింజలు నింపడానికి ఇంకొక మనిషి అవసరమవుతారు. లీటరు నీటికి గ్రాము చొప్పున కార్బండాజిమ్ కలిపిన ద్రావణంలో విత్తనాలు 12గంటలు నానబెట్టి 24గంటలు మండెకట్టి, కొద్దిగా కొమ్ము పగిలిన గింజలను డ్రమ్‌సీడర్ ద్వారా విత్తుకోవచ్చు. నారుమడిలో నీటి యాజమాన్యం ఏ విధంగా చేస్తామో వరి మొదటి దశల్లో అదే పద్ధతిని అవలంబించాలి. డ్రమ్‌సీడర్ పరికరానికి 4 ప్లాస్టిక్ డ్రమ్ములుంటాయి. ప్రతి డ్రమ్ముకు 20 సెం.మీ.దూరంలో రెండు చివర్ల వరుసకు 18 రంధ్రాలు ఉంటాయి. ఈ డ్రమ్ములో మొలకెత్తిన విత్తనాలను నింపి మూత బిగించాలి. గింజలు రాలడానికి వీలుగా ప్రతి డ్రమ్ములో మూడో వంతు మాత్రమే గింజలు నింపాలి. గింజలను నింపిన డ్రమ్‌సీడర్ లాగితే 8 వరుసల్లో వరుస వరుసకు మధ్య 20 సెం.మీ దూరంలో గింజలు పడతాయి. వరుసల్లో కుదురు కుదురుకు మధ్య దూరం 5-8 సెం.మీ ఉంటుంది. ఒక్కో కుదురులో 5-6 గింజలు రాలడం జరుగుతుంది. కొన్ని అనివార్య కారణాల వలన (మొలక సరిగ్గా లేకనో పక్షులు తినివేయడం వల్ల) కుదురులోని గింజలు 50 శాతం దెబ్బతిన్నా మిగిలిన 50 శాతం గింజల నుంచి వచ్చిన మొక్కల సాంద్రత సరిపోతుంది. రకాన్ని బట్టి గింజలు రాలడాన్ని బట్టి రంధ్రాలను మూసుకోవాలి. సన్న గింజ రకాలకు రంధ్రం వదిలి మరో రంధ్రాన్ని మూసేయాలి. ప్రతి 16 వరుసలకు అడుగు వెడల్పు కాలి బాటలు ఉంచుకోవాలి. తాడు వాడి డ్రమ్ లాగితే వరుసలు బాగా వస్తాయి. కోనోవీడర్ తిప్పడానికి వీలుగా ఉంటుంది.

కలుపు నివారణ

విత్తిన మూడవ రోజున పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 80 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా బెంథియోకార్బ్ 1.25 లీటర్లు లేదా బుటాక్లోర్+సేఫెనర్ 1.25 ఎకరానికి 20 కిలోల ఇసుకలో కలిపి విత్తిన 8-10 రోజుల్లోపు పొలంలో పలుచని నీరుంచి చల్లుకోవాలి. దమ్ము చేసిన పొలంలో మండె కట్టిన విత్తనాన్ని పొలమంతా సమంగా పల్చటి నీటి పొర నుంచి వెదజల్లాలి.

పంట దిగుబడి : సాధారణ సాగు కన్నా ఈ పద్ధతిలో పంట దిగుబడి అదనంగా వస్తుంది. సాళ్లలో కోనో వీడర్ ద్వారా కలుపు తీస్తే, ఈ కలుపు పంటకు పచ్చిరొట్ట ఎరువు అవుతుంది. పిలకలు, దుబ్బులు అధికంగా వస్తాయి. విత్తిన తర్వాత పంట కాలంలో రెండు నుంచి మూడు సార్లు కోనోవీడర్ తిప్పితే అధిక పంట దిగుబడి వస్తుంది.

పొలం తయారీ

సాధారణ పద్ధతిలో వరి నాటేటప్పుడు భూమిని తయారు చేసినట్లుగానే ఈ పద్ధతిన కూడా తయారు చేయాలి. పొలంలో నీరు నిలువ ఉండకూడదు కాబట్టి నీరు ఎక్కువైతే బయటికి పోవడానికి ఏర్పాట్లు చేయాలి. వీలైనంత బాగా చదును చేసుకోవాలి. పెద్దగా ఉన్న పొలాలను చిన్న మడులుగా విభజించుకుని చదును చేయడానికి, నీరు పెట్టడానికి, విత్తనం విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. విత్తే సమయానికి నీరు లేకుండా బురదగా ఉంటే చాలు. ఇసుక శాతం ఎక్కువ ఉన్న నేలలో విత్తాలనుకున్న రోజే ఆఖరి దమ్ము చేసి, మండె కట్టి మొలక వచ్చిన విత్తనాలను విత్తుకోవాలి.